క్లుప్తంగా

కాశీవిశ్వేశ్వరుడికి వెండి నాగాభరణం అందజేత



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులోని విశాలాక్ష్మి, అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పి.వెంకటరెడ్డికి గుంటూరుకు చెందిన కె.భక్తవత్సలరెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు వెండి నాగాభరణం మంగళవారం అందజేశారు. ఆలయ అర్చకులు రావూరి పూర్ణానందశాస్త్రి, ఆంజనేయశాస్త్రి ఆశీర్వదం అందజేశారు.

రామాలయానికి శఠగోపం అందజేత



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సెంటర్(కొత్తూరు)లో వేంచేసియున్న శ్రీ కోదండ సీతారామాలయం దేవస్థానానికి కళ్లం వెంకటరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరపున శఠగోపురాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కళ్లం రాజశేఖరరెడ్డి, ఆయన సతీమణి నాగమణి మాట్లాడుతూ తాడేపల్లి శ్రీ కోదండ సీతారామాలయంలో పూర్వకాలం నుంచి ఉన్న శఠగోపురం పాడవడంతో రూ.55 వేలతో కొత్త శఠగోపురం, వెండిపళ్లెం అందజేసినట్లు తెలిపారు. పూజారి శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్ళం రాజశేఖరరెడ్డి దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి, స్థానికులు మేకా అంజిరెడ్డి పాల్గొన్నారు.

తాడికొండ అడ్డరోడ్డు వద్ద నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 1,63,500 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సిహెచ్.ప్రభాకర్ తెలిపారు. తాడికొండ శివారు బడేపురం గ్రామానికి చెందిన మద్దినేని సురేష్‌బాబు కారులో రూ.లక్ష, గుంటూరు పట్టణానికి చెందిన చిలకపాటి చతుర్వేది రూ.63,500 కారులో తీసుకుని వెళుతున్న సమయంలో తనిఖీల్లో పట్టుబడినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదు ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు చెప్పారు.

ముస్లింలకు డ్రైఫ్రూట్స్ పంపిణీ

నిడుముక్కల (తాడికొండ): మండల పరిధిలోని నిడుముక్కల గ్రామంలో ముస్లింలకు సెమియా, డ్రైఫ్రూట్స్ వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు బెజ్జం సాయిప్రసాద్, సర్పంచి మాదాసు రత్నకుమారి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిడుముక్కల ఎంపీటీసీ బోడపాటి సుశీల, జిల్లా ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి బి.వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ మాదాసు ఏసురత్నం, జిల్లా ఎస్సీసెల్ నాయకులు తోకల నరసింహారావు, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండరు ఆవిష్కరణ

తెనాలి: ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో రూపొందించిన త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండరు (త్రైత శకం–46)ను మంగళవారం తెనాలిలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరణ అనంతరం తెలుగు క్యాలెండరును తెనాలి డీఎస్పీ, త్రీటౌన్ పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి అందరికీ అర్థమయ్యేలా సరళమైన భాషలో రూపొందించినట్టు నిర్వాహకులు తెలియజేశారు. తెలుగు నెలలు అనుసరించేందుకు వీలుగా తెలుగు తిథులతో, ఆంగ్ల తేదీలతో కాల సూచికను తీసుకొచ్చినట్టు వివరించారు.

అలరించిన కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరి



తెనాలిటౌన్: నెహ్రూరోడ్డులోని రుక్మిణి సత్యభామ సమేత గోవర్ధన స్వామి దేవాలయ ఆవరణలో క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా మంగళవారం రాత్రి సంగీత సద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించారు. విజయవాడకు చెందిన శాంత బృందం సభ్యులు వివిధ వాగ్గేయ కరకృత్తులు(రామ పదమైన), కీర్తనలు గానం చేశారు. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్ (విజయవాడ), మృందగంపై కెవి.రామకృష్ణ (తెనాలి) సహకరించారు. అనంతరం పంచాగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు



బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



మల్లిఖార్జునస్వామి వారు



ఉగాది వేడుకలలో పాల్గొన్న అతిథులు

పాత గుంటూరు: నగరంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీలు చలువ పందిళ్లతో వేదికలను ఏర్పాటు చేశారు. పంచాంగ పఠనం, కవి సమ్మేళనాలు నిర్వహించారు. భక్తులందరికీ ఉగాది పచ్చడి అందించారు. పాత గుంటూరులోని అంకమ్మతల్లి, కొత్తపేట శివాలయం, తదితర ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు.

- బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్. మస్తానయ్య ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి కృష్ణ బృందం నిర్వహణలో అత్యంత శోభాయమానంగా అలంకరించిన శ్రీవారి దర్శనం ఉదయం ఐదు గంటలనుంచే ప్రారంభమైంది. విశేషంగా పాల్గొన్న భక్తులు, అనేక మంది పుర ప్రముఖులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. తొలుత నాగార్జున సాంస్కృతిక కేంద్రం నిర్వహణలో అన్నమయ్య కళావేదికపై ఆర్.సూర్యలక్ష్మీచే శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి పంచాంగ శ్రవణం, అనంతరం కవి సమ్మేళనం జరిగాయి. సంగీత విభావరి నిర్వహించారు.


మల్లిఖార్జున స్వామివారికి విశేష అభిషేకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లిఖార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామివారి దేవస్థానంలో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రశేఖర శర్మచే స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలను నిర్వహించి, విశిష్ట అలంకరణలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఉగాది పచ్చడి వితరణ చేశారు.

పెదకాకాని శివాలయంలో పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణం చేస్తున్న పాపరాజు సాయిరామశాస్త్రి, పొత్తూరి సాంబశివరావు



గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులు

పెదకాకాని: ప్రజలందరికీ క్రోధి నామ సంవత్సరం అనుకూలంగా ఉంటుందని దేవస్థాన కృష్ణయజుర్వేద పారాయణదారు పాపరాజు సాయిరామశాస్త్రి అన్నారు. పెదకాకాని శివాలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకుని భ్రమరాంబ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకస్వాములు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం క్రోధి నామ సంవత్సరం, ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు పర్యవేక్షణలో విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. క్రోధి నామ సంవత్సర రాశి ఫలితాలు, వర్షాభావ పరిస్థితులు, పాడి పంటలు, విద్య, వ్యాపార అనుకూలత వంటి అంశాలపై పంచాగ శ్రవణం చేశారు. పంచాంగ శ్రవణం అనంతరం భక్తులందరికీ క్రోధి నామ పంచాగం, ప్రసాదాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆలయ స్థానాచార్యుడు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, రుగ్వేద పారాయణదారులు వ్యాకరణం శ్రీలక్ష్మీగణపతి శర్మలను ఘనంగా సత్కరించారు.

వైఖానస ఆగమ అర్చకుడికి సన్మానం

ఫిరంగిపురం: ఫిరంగిపురం గ్రామానికి చెందిన వైఖానస ఆగమ వేదపండితుడు, వేణుగోపాల స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణం ప్రసాదాచార్యులను మంగళవారం కలెక్టర్ వేణుగోపాలరెడ్డి సన్మానించారు. ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గుంటూరు కలెక్టర్ నివాసంలో నిర్వహించిన అర్చకులకు సన్మానం కార్యక్రమంలో నారాయణం ప్రసాదాచార్యులను శాలువా, సన్మానపత్రంతో సన్మానించారు. ఈఓ రామిరెడ్డి, ధర్మకర్త నాగవెంకటరమణ, అర్చకులు దీవి ప్రసన్నమూర్తి, కృష్ణమూర్తి, మురళి అభినందనలు తెలిపారు.

దేవుని సేవకులు ఐక్యతగా ఉండాలి



తెనాలిటౌన్: దేవుని సేవకులు ఐక్యతగా ఉండాలని దేవుడిని నమ్ముకుంటే గొప్ప కార్యాలు సాధించగలమని ఈరే మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ సుధీర్‌కుమార్ అన్నారు. రూరల్ మండలం నందివెలుగు ఇందిరా కాలనీలోని యెహోవా ఈరే చర్చిలో మంగళవారం తెనాలి మండల పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. సమావేశానికి ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ ఎ.భానుప్రసాద్ అధ్యక్షత వహించగా ఫెలోషిప్ కోశాధికారి ఎం.బర్నబాను స్వాగతం పలికారు. సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిషప్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తుకు అసాధ్యమైన కార్యములు ఏమిలేవని అన్నారు. ఫెలోషిప్ ద్వారా మండల గ్రామాల్లో దైవసేవకులు పరిచర్యలను చేయాలని సూచించారు. ప్రార్థన కూడికలు నిర్వహించే పాస్టర్లు దైవసేవకులకు నిర్వహణ నిమిత్తం ఆర్థికసాయం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రెసిడెంట్ భాను ప్రసాద్ మాట్లాడుతూ ఫెలోషిప్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి నెల రెండో మంగళవారం ఫెలోషిప్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో సెక్రటరీ రాకడ పీటర్ పాల్, వైస్ ప్రెసిడెంట్ రమేష్, కోశాధికారి బర్నబాబు, జాయింట్ సెక్రటరీ సువర్ణరాజు, ఎగ్జిక్యూటివ్‌మెంబర్స్ అజిత్, యోబు, ఏసుబాబు, లోకా, బిషప్ జడ్సన్, రెవరెండ్ ఎం.జానుబాబు, క్రిస్టఫర్, రాజశేఖర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల మహేష్, పాస్టర్లు, దైవసేవకులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలిటౌన్: క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా గాంధీనగర్‌లోని శ్రీ షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు అన్నదానం చేశారు. సంగారెడ్డి గ్రామస్తులు తలారి నరసింహులు వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యోగా టీచర్ బి.సుజాత మాట్లాడారు. ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం



పంచాగ శ్రవణం ఆలకిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

- పంచాంగ కర్త బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ
- ఉగాది వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే శివకుమార్



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న చిన్నారులు

తెనాలిటౌన్: సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ పేర్కొన్నారు. క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా బోసురోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో సహస్రగళ శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ మహోత్సవం నిర్వహించారు. హనుమాన్ సేవా సమితి, పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శశి గ్రూప్ ఆధ్వర్యంలో పారాయణం జరిపారు. హనుమాన్ సేవా సమితి నిర్వాహకులు వుప్పల వరదరాజులు ఆధ్వర్యంలో చిన్నారులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ఉగాది పంచాగ శ్రవణం జరిపారు. బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథశర్మ పంచాగ శ్రవణం చేశారు. పంచాగ శ్రవణంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని పంచాగ శ్రవణాన్ని ఆలకించారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్, నాయకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు నూకల వెంకట వేణుగోపాల రావు, కార్యదర్శి బూరెల నరసింహారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, హనుమాన్ సేవా సమితి నిర్వాహకులు వుప్పల వరదరాజులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మి కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాలి శేషాచలం, గొడవర్తి సాయి హేరామ్, నాళం రజనికుమార్, కఠారి హరీష్, విశ్వేశ్వరరావు, కాళిదాసు వెంకటేశ్వరరావు, ఎస్.రఘురామిరెడ్డి, పెసర్లంక రమణ, మీరావళి తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుదారులకు పురపాలిక తీపి కబురు

తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలో నివసించే వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. తమ ఇంటి, ఖాళీ స్థలాల పన్నులను ఒకేసారి ఈ నెల 30వ తేదీ లోపు చెల్లిస్తే పన్నులో అయిదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీంతో గృహ, ఖాళీ స్థల యజమానులు పన్నుల చెల్లింపులను ప్రారంభించారు. తెనాలి పురపాలక సంఘ పరిధిలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు వెరసి ఏడాదికి సుమారు రూ.18 కోట్ల ఆదాయం పురపాలికకు సమకూరుతూ ఉంటుంది. తెనాలి పట్టణ పరిధిలో సుమారు 36,385 నివాస గృహాలు ఉన్నాయి. వీటికి ఏడాదికి రెండు సార్లు పన్ను విధించి వసూలు చేస్తుంటారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఒకసారి, అక్టోబర్ నుంచి మార్చి వరకు మరోసారి పన్నులను విధించి వసూలు చేస్తుంటారు. పన్నుల రూపంలో ప్రతి ఏడాది వీటి ద్వారా సుమారు రూ.17 కోట్ల ఆదాయం మున్సిపాలిటీకి సమకూరుతుంది. ఇదికాకుండా మున్సిపాలిటీ షాపుల అద్దె కింద సుమారు రూ.1.80 కోట్లు ఆదాయం సమకూరుతూ ఉంటుంది. తెనాలి పట్టణంలో 2,706 కాళీ స్థలాలు ఉన్నాయి. వాటి ద్వారా సుమారు రూ.కోటి ఆదాయం మున్సిపాలిటీకి సమకూరుతూ ఉంటుంది. వీటన్నింటిపై తెనాలి పురపాలక సంఘానికి ఏడాదికి రూ.19.80 కోట్ల ఆదాయం సమకూరుతుందని చెప్పవచ్చు.

జిల్లాలో తెనాలి పురపాలిక మొదటి స్థానం

తెనాలి పురపాలక సంఘం జిల్లాలోనే సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా రూపుదిద్దుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్పెషల్ గ్రేడ్‌గా ఉన్న తెనాలికి సెలక్షన్ గ్రేడ్‌ను ఇచ్చింది. గతేడాది పన్నుల రూపంలో రూ.16.72 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా 2024 మార్చి 31వ తేదీ నాటికి రూ.14.58 కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ.2.14 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. దీనిని బట్టి చూస్తే పన్నుల వసూలులో తెనాలి ముందు వరుసలో ఉందనే చెప్పవచ్చు. గతేడాది పన్నుల వసూలులో రాష్ట్రంలోని పురపాలక సంఘాలలో తొమ్మిదో స్థానం, జిల్లాలో ప్రథమ స్థానం సాధించిందని అధికారులు తెలిపారు.

39,091 మందికి రాయితీ అర్హత

తెనాలి పట్టణంలోని ఇంటి, కాళీ స్థల యజమానులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వాటి పన్నులను ఈ నెల 30వ తేదీ లోపు ఒకేసారి చెల్లిస్తే అయిదు శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో తెనాలి పట్టణంలోని 36,385 మంది ఇంటి యజమానులకు, 2,706 మంది కాళీ స్థల యజమానులకు రాయితీ వర్తిస్తుంది. దీనిని బట్టి చూస్తే తెనాలి పట్టణంలో 39,091 మందికి ప్రభుత్వ ప్రకటన మేలు చేయనుంది.

భక్తులపాలిట కల్పవల్లి పోలేరమ్మతల్లి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి విడదల రజిని



నిదానంపాటి శ్రీలక్ష్మీఅమ్మవారి విగ్రహానికి అభిషేకం చేస్తున్న మంత్రి రజిని

నెహ్రూనగర్: భక్తుల పాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే కరుణామయి పోలేరమ్మ తల్లి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు వెస్ట్ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు అమరావతి రోడ్డు 49వ డివిజన్‌లోని కొండయ్య కాలనీ ఒకటో లైనులో ఉన్న లక్ష్మీ పోలేరమ్మ తల్లి దేవస్థానం మూడో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మంత్రి రజని ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం కమిటీ సభ్యులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలేరమ్మ తల్లి మహిమ గల అమ్మవారని, భక్తులు నిండు విశ్వాసంతో, పవిత్ర హృదయంతో పూజలు చేస్తే, తప్పకుండా వారికి మంచి జరుగుతుందని తెలిపారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ రజక ఐక్య సంఘాల వేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు, స్థానిక కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి, 31వ డివిజన్ కార్పొరేటర్ అందుగుల సంతోష్, వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి కిషోర్, వంగల వలివీరారెడ్డి, అన్నదానం సత్రం డైరెక్టర్ రవీందర్, పార్టీ నాయకులు పోకల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు అరవింద్, సత్య, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

మహిమాన్వితం నిదానంపాటి అమ్మవారి చరితం..

నెహ్రూ నగర్: సాక్షాత్తు పార్వతీదేవి అవతారమైన నిదానంపాటి శ్రీలక్ష్మీదేవి అమ్మవారు ఎంతో మహిమాన్వితురాలని, ఆమెను పూజిస్తే సంతాన భాగ్యంతో పాటు, సకల సంపదలు ఒనగూరుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు వెస్ట్ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు నల్లకుంట 12వ లైనులో ఉన్న త్రిశక్తి నిదానంపాటి అమ్మవారి ఆలయంలో ఉత్సవాలకు మంత్రి రజిని హాజరయ్యారు. ఈ ఆలయంలో ప్రతి ఏడాది ఉగాది నాడు కలశ పూజ నిర్వహిస్తారు. అందులో భాగంగా మంగళవారం 101 మంది మహిళలు కలశాలు నెత్తిన పెట్టుకుని నల్లకుంట ప్రధాన వీధుల్లో ఊరేగింపు జరిపారు. అనంతరం ఆలయానికి చేరుకున్నారు. ఈ ఉత్సవాలకు హాజరైన మంత్రి రజిని కొబ్బరికాయ కొట్టి కలశాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి చేరికలు

- వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా
- 15వ డివిజన్‌కు చెందిన పలువురు పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారితో నూరిఫాతిమా

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ప్రతి ఒక్కరూ ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 15వ డివిజన్ ప్రగతి నగర్, సుద్దపల్లి డొంక ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన, పార్టీలకు చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత సయ్యద్ సూరజ్, మస్తాన్‌ల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. మంగళదాస్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో జరిగిన చేరిక కార్యక్రమంలో కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మీ ఇంటి బిడ్డగా తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఇలియాస్, ఫెరోజ్, అఫ్జర్, హనీఫ్, పఠాన్, అమీర్, అజీస్, సయ్యద్ కరీముల్లా, రిజ్వాన్, ఫయాజ్, వ్యూజ్, జబీర్, సకీబ్, రెహమాన్, మెహమూబ్, ఆరీఫ్, జానీ, జమీర్, అమీర్, నిజామ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టిప్పర్

ఒకరి మృతి



మృతిచెందిన ఉడతా బుల్లి వెంకయ్య

మేడికొండూరు: ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చిన క్రషర్ టిప్పర్ బలంగా ఢీకొంది. ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పేరేచర్ల డొంకలో మంగళవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని డోగిపర్రు గ్రామానికి చెందిన ఉడతా బుల్లివెంకయ్య, స్నేహితుడు మొక్కల బ్రహ్మయ్య ద్విచక్ర వాహనంపై చేబ్రోలు మండలం అనంతారం వెళ్లి తిరిగి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో పేరేచర్ల డొంక వద్దకు రాగానే వెనుకగా వచ్చిన క్రషర్ టిప్పర్ లారీ బలంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఉడతా బుల్లి వెంకయ్య(33) రోడ్డుపై పడడంతో లారీ అతడిపైగా వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బ్రహ్మయ్యకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి ప్రతిష్టా మహోత్సవాలు

స్వామి వార్లకు, గ్రామదేవతలకు నూతన వస్త్రాలు



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో పునర్నిర్మించిన అంకమ్మతల్లి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పన్నెండవ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజైన మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు ప్రత్తిపాడులో కొలువుదీరిన దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. సుప్రసిద్ధ గంగాపార్వతీ సమేత దండేశ్వారాలయంలో, వేణుగోపాల, సీతారామస్వామివార్ల దేవాలయం, విఘ్నేశ్వరాలయం, మళయాల పరమేశ్వరస్వామి దేవస్థానం, రామాలయాలతో పాటు గ్రామదేవతలకు, అమ్మవార్లకు, తాంబూల సహిత నూతన వస్త్రాలను స్వామివార్లకు, అమ్మవార్లకు సమర్పించారు. ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.